క్లుప్తంగా

జాగ్రత్తలు తప్పనిసరి

బలిజిపేట: రానున్న వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని బలిజిపేట హోలీస్పిరిట్ కేర్ అండ్ సపోర్ట్ కేంద్రం సిస్టర్ జీవా తెలిపారు. అంపావల్లి, జనార్దనపురం గ్రామాల్లో వడదెబ్బలు, తాగునీరు, ఆరోగ్య పరిరక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండల్లో పనులు చేయకూడదన్నారు. అలాగే వీలైనంతవరకు మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని చెప్పారు. ఏమాత్రం అనారోగ్యంగా ఉన్నా సమీప పీహెచ్‌సీల్లో వైద్యసేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ తవిటయ్య, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మిర్తివలసలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: మండలంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంఈఓ-1 సామల సింహాచలం అన్నారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సదుపాయం, తాగునీరు, ర్యాంప్, ఫ్యాన్లు, ఫర్నీచర్, తలుపులు, కిటికీలు, తదితర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. మిర్తివలస పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

• ఎస్సై రాజేష్



వాహనదారుడితో మాట్లాడుతున్న ఎస్సై రాజేష్

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని ఎస్సై ఎం. రాజేష్ కోరారు. బుధవారం స్థానిక ఆర్‌టీబీ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. అతివేగం కూడా పనికిరాదని, కార్లు నడిపేవారు తప్పకుండా సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అలాగే వాహన యజమానులు అన్నిరకాల ధ్రువపత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు



పెదబోగిలిలో కాలువల్లో పూడికలు తీస్తున్న కార్మికులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఉన్నతాధికారుల సూచనల మేరకు పారిశుధ్య పనులు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు జె. వెంకటరావు, సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదబోగిలిలో సర్పంచ్ జె. తేరేజమ్మ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువలో పేరుకుపోయిన మురుగును ఈ సందర్భంగా తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ, ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



తెలుగుతల్లి చిత్రపటం వద్ద విద్యార్థులు

సీతానగరం: మండలంలోని బగ్గందొరవలసలో గల కృషీ విద్యానికేతన్ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం కరస్పాండెంట్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు

తోటలు దగ్ధం



సీతానగరం: మండలంలోని చినంకలాంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నీలగిరి, టేకు తోటలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

ప్రజలకు అండగా వలంటీర్లు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరంసత్కారం అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే జోగారావు, తదితరులు

సీతానగరం: కరోనా వంటి కష్టకాలంలో కూడా ప్రజలకు అండగా నిలిచిన వలంటీర్లను సత్కరించుకోవడం మనందరి బాధ్యతని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని అంటిపేట సచివాలయం ప్రాంగణంలో పెదంకలాం, నిడగల్లు, లక్ష్మీపురం, బూర్జ, దయానిధిపురం, కాశీపేట, అంటిపేట, వెంకటాపురం, గాదెలవలస, రంగంపేట సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్‌ల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే ఇంటివద్దే పింఛన్లు అందిస్తూ వలంటీర్ల ప్రజా మన్ననలు పొందారన్నారు. వలంటీర్ వ్యవస్థ ప్రజలకు చేరువకావడంతో ప్రతిపక్షాలు ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జి. తిరుపతి రావు, ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.నిర్మల, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుపతిరావు, పార్టీ సీనియర్ నాయకులు బి. శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ, వైస్ ఎంపీపీ టి. సూర్యనారాయణ, ఎంపీడీఓ ఎం. ఈశ్వరరావు, ఈఓపీఆర్‌ఆర్డీ కె. కుమారవర్మ, పార్టీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, వి. దానబాబు, సిరికి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సచివాలయ కన్వీనర్లు, పీఏసీఎస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

నిస్వార్థ సంక్షేమ సేవకులు..



పార్వతీపురం టౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను నిస్వార్థంగా ప్రజలకు అందిస్తున్న వలంటీర్లు నిజమైన సేవకులని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని చినబొండపల్లిలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వలంటీర్ల సేవలను ప్రసంశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చారని చెప్పారు. ఆయా వ్యవస్థల ద్వారా ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. ఇంతటి మంచి గుర్తింపు తీసుకువచ్చిన సీఎం జగనన్నకు అండగా నిలిచి రుణం తీర్చుకోవాల్సిన సమయం వచ్చిందని, రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల వేళ టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ మరడాన భాగ్యశ్రీ, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు భీమవరపు కృష్ణమూర్తి, జిల్లా జనరల్ సెక్రటరీ బి. గురురాజు, ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయం

• మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి



రోగులకు మందులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. పార్వతీపురం పట్టణంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. నాడు-నేడు పథకం ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మార్చడమే కాకుండా ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచారన్నారు. గ్రామీణ ప్రాంత వాసులకు ఇంటివద్దే వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. మరోపక్క జేఏఎస్-2 ద్వారా గ్రామాల్లో స్పెషలిస్ట్ వైద్యులచే సేవలందిస్తూ, అవసరమైన వారికి శస్త్రచికిత్సలకు రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి. సింహాచలం, ఎన్‌జీఓ సంఘ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ కిశోర్, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వార్డు వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ పగడాలమ్మ

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోందని డీఈఓ పగడాలమ్మ అన్నారు. మండలంలోని పెద బొండపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. పది పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చునని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో సిబ్బంది



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఓ జగన్ మోహనరావు

పార్వతీపురం టౌన్: డ్యూటీ షిఫ్టుల ప్రకారం సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఎంఓ టి. జగన్ మోహనరావు అన్నారు. పీహెచ్‌సీ పనితీరు తనిఖీల్లో భాగంగా మండలంలోని బందలుప్పి పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రాత్రి సమయాల్లో ఏ విధమైన ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు ఆస్పత్రికి వస్తారని సిబ్బందిని అడిగి, రికార్డులను తనిఖీ చేశారు.

రాత్రి సమయాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం తాగునీటి లభ్యతను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాతుమూరులో దొంగతనం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

పాచిపెంట: మండలంలోని మాతుమూరు గ్రామంలో ఓ ఇంటిలో బుధవారం దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన ముఖి సరస్వతమ్మ(52) ఉపాధి హామీ పనికి వెళ్లింది. ఇంటిలో ఎవరు లేని విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంటి వెనక భాగం నుంచి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఇంటికి వచ్చిన సరస్వతమ్మ దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలిసులకు సమాచారం అందించారు. సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐ నారాయణరావు సంఘటనా స్థలానికి చేరి పరిశీలించారు. సుమారు 7తులాలకు పైగా నగదు పోయినట్టు గుర్తించామని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తల్లి రోజమ్మకు మంత్రి రాజన్నదొర నివాళులు



తల్లి రోజమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించిన మంత్రి రాజన్నదొర

మక్కువ: మండలంలోని మర్రివానివలస గ్రామంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తన కుటుంబ సభ్యులతో కలిసి తల్లి రోజమ్మ మూడవ వర్ధంతి సందర్భంగా బుధవారం నివాళులర్పించారు. అనంతరం మండలంలోని కవిరిపల్లి గ్రామానికి చెందిన పెంట తాతయ్య మాస్టర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. తాతయ్య మాస్టర్ చిత్రపటం వద్ద నివాళులర్పించి, కుటంబ సభ్యులను ఓదార్చారు.

అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో బలిజిపేట మండలం నుంచి వాలీబాల్ రన్నరప్‌గా నిలిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయంలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలిపారు.

జాబ్‌మేళా రేపు

పార్వతీపురం టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 23న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వహిదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎఫ్‌ఐఎల్ సంస్థ, మ్యాక్స్ ఫ్యాషన్ ఇంటర్నేషనల్, నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, శ్రీ రక్షిత్ బిజినెస్ సంస్థల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని, 18 నుంచి 45 ఏళ్ల లోపు అభ్యర్థులు పాల్గొనవచ్చునన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. బయోడేటా, రెండు ఫొటోలు, ఆధార్, పాన్ కార్డు తీసుకురావాలన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



అగ్నిప్రమాదాల నివారణపై వివరిస్తున్న అగ్నిమాపక అధికారి

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకరరావు అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై పట్టణంలో ఓ పార్లర్ వద్ద అవగాహన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, విద్యుత్ తదితర కారణాలతో అగ్ని ప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి, వాటిని ఎలా నివారించాలి అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సీతంనాయుడు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. పట్టణంలోని అక్కేనవీధి సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు వైద్యాన్ని ముఖ్యమంత్రి చేరువ చేశారన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయ కమిటీ సభ్యులు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: బంగారమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని దేవదాయశాఖను కోరగా.. రూ. పది లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో 15, 17, 18 వార్డుకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతృభాషను గౌరవిద్దాం



గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవ కార్యక్రమం

గుమ్మలక్ష్మీపురం: మన మాతృభాష తెలుగును ప్రతీ ఒక్కరూ గౌరవించాలని, సంభాషించాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం కార్యక్రమాన్ని కళాశాల వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ జీవనోపాధి అవకాశాల కోసం ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువకూడదన్నారు. మాతృభాషలోని సౌందర్యం ఇతర భాషలలో లేదన్నారు. తెలుగు అధ్యాపకులు డి.రామయ్య మాట్లాడుతూ మాతృభాష తెలుగు కావడం గర్వకారణమని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ బి.త్రినాధ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

వీరఘట్టం: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో తెలుగు భాష ఔన్నత్యంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. తలవరం హైస్కూల్‌లో హెచ్.ఎం ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో పాఠశాలలో ఉన్న సరస్వతీ దేవి విగ్రహం వద్ద పూజలు చేశారు.

టీడీపీ మోసపూరిత హామీలను నమ్మొద్దు



వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు టీడీపీ, జనసేన పార్టీలు మోసపూరిత హామీలతో ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని వారి బారి నుంచి ఈ రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే కళావతి పిలుపునిచ్చారు. వీరఘట్టంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో బుధవారం సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ప్రతీ ఇంటికి నవరత్న పథకాల్లో ఏదో ఒక పథకం వర్తించిందని, ప్రభుత్వ పథకాలు పొందని ఇళ్లు ఒక్కటి కూడా లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మనకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే అన్నారు. పోలింగ్ బూత్‌ల పరిధిలో ఉన్న ప్రతీ గడపకు వెళ్లి టీడీపీ ఇస్తున్న దొంగ హామీలపై అవగాహన కల్పించాలని సూచించారు. 2014లో ఆరు వందలకు పైగా హామీలు ఇచ్చి గెలిచిన తరువాత మేనిఫెస్టో నుంచి ఈ హామీలను తొలగించి ఓటేసిన ప్రజలను చంద్రబాబునాయుడు నిలువునా ముంచిన విషయం ప్రజలకు తెలియజేయాలన్నారు. జన్మభూమి కమిటీల అరాచకాలు, మోసాలను గుర్తు చేయాలన్నారు. బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేసుకుని దొంగ ఓట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, జిల్లా కార్యదర్శి కళింగ ప్రేమభూషణరావు, భోగి మణి, మాచర్ల వెంకటరమణ, దోకల శ్రీను పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో సారా అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలను ఈ నెల 26న వేలం వేయనున్నట్లు ఎస్ఐ జగదీష్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో, పల్సర్ బైక్‌లకు వేలం వేయనున్నామన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొవాలన్నారు.

26న వాహనాల వేలం

నేడు గరుగుబిల్లిలో..

గరుగుబిల్లి: వివిధ కేసుల్లో పట్టుబడ్డ ఐదు ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం వేలం వేయనున్నట్టు స్థానిక ఎస్ఐ అమ్మన్నరావు బుధవారం తెలిపారు. పాలకొండ డీఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌లో ఉదయం 9 గంటలకు వాహనాల వేలం పాటను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆశక్తి గల వారు ఆధార్ కార్డుతో హాజరై వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

గరుగుబిల్లికి జూనియర్ కళాశాల మంజూరు

గరుగుబిల్లి : మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేస్తూ రాష్ట్ర విద్యా శాఖ ఉత్తర్వులను మంగళవారం జారీ చేసింది. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ 2024-25 విద్యా సంవత్సరం నుంచి కో-ఎడ్యుకేషన్ విధానంలో కళాశాలను నిర్వహిస్తున్నట్లు ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో చెరో 40 మంది విద్యార్థులతో తరగతులను నిర్వహించనున్నట్టు తెలిపారు. మండలంలో కేజీబీవీ, గురుకుల కళాశాలలతో పాటు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు అందుబాటులో కళాశాల విద్య అందే అవకాశం వుంది. మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు పట్ల కృషి చేసిన ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

మార్మోగిన రామనామస్మరణ



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అర్చకులు, భక్తులు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని ఎన్‌కే రాజపురం గ్రామంలో బుధవారం శ్రీరామ మందిర ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా గ్రామంలో ఆలయ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు. బుధవారం ఆలయ ఆవరణలో యజ్ఞకర్తల ఆధ్వర్యంలో యాగం చేశారు. గ్రామస్తులంతా యాగంలో పాల్గొని శ్రీరామనామ స్మరణ చేశారు. ధ్వజ స్తంభం, విగ్రహాల ప్రతిష్ఠ, పుణ్యవలోచనం వంటి కార్యక్రమాలను సందడిగా నిర్వహించారు.